క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం



రాజకీయ నాయకులతో సమావేశమైన తహసీల్దార్ సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సోమవారం తన కార్యాలయంలో తహసీల్దార్ సుధీర్‌రెడ్డి వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల వివరాలను తెలియజేశారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళుతున్న ఆటోను సీతారంపేట వద్ద వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంతో ఆటోలోని ఇద్దరి ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న కంటి వెలుగు పథకంలో బుచ్చినాయుడుకండ్రిగ, నెలవాయి, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో 250 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. 8 మంది విద్యార్థులకు కళ్లద్దాలను త్వరలో అందజేస్తామని హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం తెలిపారు. విద్యార్థులకు కంటి చూపు మెరుగ్గా ఉండేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపు



పోస్టర్లను తొలగిస్తున్న వీఆర్‌ఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో స్థానిక మెయిన్‌రోడ్డులో వివిధ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లను సోమవారం మండల ఎన్నికల అధికారి శివయ్య కూలీలతో తొలగించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ, మార్చి 16వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. పార్టీల నాయకులు తొలగించకపోవడంతో ఫ్లెక్సీలను తొలగిస్తున్నామన్నారు. ఎన్నికల నియమాళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్‌ఓలు ప్రసాద్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడు టిప్పర్లు సీజ్

సత్యవేడు: మండలంలో సరైన రికార్డులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న ఏడు టిప్పర్లను ఏడీ మైనింగ్ అధికారి ప్రకాష్‌కుమార్ సీజ్ చేశారు. సోమవారం చెన్నేరి సమీపంలో మైన్స్ అధికారులు తనిఖీలు చేశారు. సమీప క్వారీల నుంచి తమిళనాడుకు తరలిస్తున్న టిప్పర్లను వారు పరిశీలించారు. సరైన రికార్డులు లేక, అధిక బరువుతో ఉన్న ఏడు టిప్పర్లను సీజ్ చేసి సత్యవేడు పోలీసులకు అప్పగించారు.

తహసీల్దార్‌కు వీఆర్‌ఏల వినతి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): వీఆర్‌ఏల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు అంకయ్య, ఉపాధ్యక్షురాలు భవాని సోమవారం తహసీల్దార్ సుధీర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వీఆర్‌ఏలు మాట్లాడుతూ తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, విధుల్లో ఉంటూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు.

అడవి పంది తెచ్చిన ఉపద్రవం

- మోటారుసైక్లిస్టులకు గాయాలు

వెంకటగిరిరూరల్: రోడ్డుకు అడ్డంగా అడవి పంది రావడంతో దాన్ని ఢీకొని మోటారుసైకిల్ అదుపు తప్పి ఇద్దరు తీవ్ర గాయపడ్డారు. ఈ ఘటన వెంకటగిరి–గూడూరు మార్గంలోని కలపాడు వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. క్షతగాత్రుల కథనం మేరకు.. బాలాయపల్లి మండలం యాచవరం గ్రామానికి చెందిన కె జనార్దన్, లక్ష్మీకాంతమ్మ తమ ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనులను నిమిత్తం వెంకటగిరికి వచ్చి తిరిగి స్వగ్రామమైన యాచవరం గ్రామానికి బయలు దేరారు. ఈ క్రమంలో కలపాడు వ్యవసాయ పొలాల వద్దకు వచ్చేసరికే అడవి పంది మోటారుసైకిల్‌కు అడ్డంగా రావడంతో ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ఘటనలో జనార్దన్‌కు కాలు విరిగింది. లక్ష్మీకాంతమ్మకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి సిఫార్సు చేశారు.

ప్రపంచ ధర్మం ‘భగవద్గీత’

బ్రహ్మోత్సవాల్లో పాల్గొనటం పూర్వ జన్మసుకృతం

- భగవద్గీతా గాన, ప్రవచన, ప్రచారకర్త బ్రహ్మశ్రీ ఎల్.వీ. గంగాధరశాస్త్రి



భగవద్గీతా గాన, ప్రవచనం చేస్తున్న ప్రచారకర్త బ్రహ్మశ్రీ గంగాధరశాస్త్రి



సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభంలో పూజలు చేస్తున్న శుక బ్రహ్మశ్రమం పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి స్వామి

శ్రీకాళహస్తి రూరల్: భగవద్గీత చదివితే అన్ని శాస్త్రాలను తెలుసుకోవచ్చని, అంతేకాకుండా ఇది ప్రపంచానికి ధర్మం బోధిస్తోందని భగవద్గీతా గాన, ప్రవచన, ప్రచారకర్త బ్రహ్మశ్రీ ఎల్వీ. గంగాధరశాస్త్రి అన్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ధూర్జటి కళా ప్రాంగణంలో సోమవారం ఆయన గీతాగాన ప్రవచనం చేశారు. శ్రీకాళహస్తిలో కాలుమోపగానే ఆధ్యాత్మిక చింతన ఉట్టిపడేలా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు మనస్సుకు హత్తుకున్నాయన్నారు. తాను పరమశివుని ఆశీస్సులతోనే ముక్కంటి బ్రహ్మోత్సవాల్లో పాలుపంచుకుని గీతాగాన ప్రవచనాన్ని భక్తకోటికి వినిపించే భాగ్యం కలిగిందని, ఇది పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు చెప్పారు. భగవద్గీత పారాయణం పలు సందేహాలకు పరిష్కారం, ఎన్నో ప్రశ్నలకు సమాధానం చూపుతుందన్నారు. గుడికి జ్ఞానం కోసం వెళ్లాలేగానీ సమస్య వచ్చినప్పుడు వెళ్లకూడదన్నారు. అక్రమ సంపాదనతో దేవుడికి ఆభరణాలు, నగదు రూపంలోను చెల్లిస్తే పాప ప్రక్షాళన అవుతుందనుకోవడం అవివేకమన్నారు. దేవుడు ఇచ్చేవాడేగానీ తీసుకునే వాడు కాదని హితోక్తులు పలికారు. ప్రతిఒక్కరూ దైవతత్వం గురించి తెలుసుకోవాలని, రోజూ గుడికి వెళ్లడం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో స్వామి,అమ్మవార్ల కరుణా కటాక్షాలు భక్తులందరికి ప్రాప్తించాలని కోరారు.

సాంస్కృతిక సంబరం

శ్రీకాళహస్తి రూరల్: సోమవారం రాత్రి ధూర్జటి కళాప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలకు శుక బ్రహ్మశ్రమ పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి స్వామి జ్యోతి ప్రజ్వలన, పూజలతో లాంఛనంగా ప్రారంభించారు.

దాతల ఔదార్యం



ఆలయ చైర్మన్‌కు చెక్కు ఇస్తున్న ఎస్‌బీఐ మేనేజర్లు

శ్రీకాళహస్తి: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రూ.లక్ష విరాళం చెక్కును సోమవారం ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబుకు అందజేశారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలకు వీరు ఆనవాయితీగా విరాళం ఇవ్వడం పరిపాటి. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్లు స్వప్నప్రియ, బాలాజి, పవన్, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

అన్నదానం

బోయ సంఘం, అంబలి స్వామి ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహా శివరాత్రి వాహన ఊరేగింపులో చెన్నైకు చెందిన హిందూ ధర్మార్థ సమితి వ్యవస్థాపకులు ఆర్‌ఆర్ గోపాల్ 5 గొడుగులను ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేశారు. అలాగే అన్నదానానికి ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు పాండు దంపతులు రూ.10,116 అందజేశారు.

మీడియా పాయింట్ ప్రారంభం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను బహుళ ప్రచార సాధనాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోమవారం ఆలయ ప్రాంగణంలో పరిపాలన భవనం వద్ద మీడియా పాయింట్‌ను ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆలయ ఈఓ సాగర్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కామేష్, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళిరెడ్డి, కార్యవర్గ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముక్కంటికి 50 టన్నుల కూరగాయలు

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలలో నిత్యాన్నదానానికి కర్నూలు జిల్లాకు చెందిన నంద్యాల ప్రసాద్ సోమవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయానికి 50 టన్నుల కూరగాయలను స్వామి అమ్మవార్లకు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ, 15 ఏళ్ల నుంచి నుంచి బ్రహ్మోత్సవాలకు క్రమం తప్పకుండా 15 టన్నులు కూరగాయలు ఇచ్చేవారమని, ఈ ఏడాది మాత్రం 50 టన్నులు సమర్పించినట్లు చెప్పారు. దర్శనానంతరం



ఆయన్ను ఆలయ చైర్మన్, ఈఓ శేష వస్త్రంతో సత్కరించి వేద పండితుల చేత ఆశీర్వదించారు. న్యాయవాది లక్ష్మీపతి, మునికృష్ణ, నరసింహులు, భాస్కర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఆలయానికి దివ్యాభరణాలు



ఎస్‌బీఐ లాకర్ నుంచి తీసి ప్రదర్శించిన స్వామి, అమ్మవార్ల బంగారు ఆభరణాలు

శ్రీకాళహస్తి: బ్రహ్మోత్సవ సమయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు అలంకరించే బంగారు ఆభరణాలు సోమవారం ఎస్‌బీఐ బ్యాంకు లాకర్ నుంచి ఆలయానికి తీసుకువచ్చారు. వజ్ర వైఢూర్యాలు, కెంపులు పొదిగిన హారాలు, కిరీటాలు, రుద్రాక్ష మాలలు, చిలుక, శంఖాలు, పాపిట బిళ్లలతో కూడిన ఆభరణాలను ఈఓ సాగర్‌బాబు, ఇతర అధికారుల సమక్షంలో ఆలయానికి చేర్చారు.

పదేళ్లుగా వస్తున్నాం



శివమాలలు ధరించి ప్రత్యేక పూజలు చేస్తున్న మధురై భక్తులు

రేణిగుంట : శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పదేళ్లుగా వస్తున్నట్లు తమిళనాడులోని మధురైకు చెందిన పది కుటుంబాల భక్తులు తెలిపారు. సోమవారం వారు ముక్కంటి ఆలయానికి చేరుకుని శివమాలలు ధరించారు. ఉత్సవాలు నిర్వహించే మొత్తం 13 రోజులపాటు ఇక్కడే ఉంటూ పరమేశ్వరుని సేవించుకోనున్నట్లు వెల్లడించారు.

వలంటీర్లుగా సమాజ సేవ చేయండి



స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లను అభినందిస్తున్న కమిషనర్ బాలాజీనాయక్

- స్కౌట్స్ అండ్ గౌడ్స్‌కు మున్సిపల్ కమిషనర్ పిలుపు

శ్రీకాళహస్తి: చదువుతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లుగా సమాజానికి సేవ చేయాలని శ్రీకాళహస్తి మునిసిపల్ కమిషనర్ బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ఉత్తీర్ణత సాధించిన బాబు అగ్రహారం మునిసిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఆయన సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. ఉన్నత విలువలతో విద్యార్థులు ముందుకుసాగడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కౌట్స్ కౌన్సిల్ మెంబర్ టి. రమేష్ బాబు, స్కౌట్ మాస్టర్ ఎస్‌కె.అజారుద్దీన్, సుబ్రమణ్యం, వెంకటేష్, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే జైలు, జరిమానా

- సీడీపీఓ శాంతిదుర్గ

శ్రీకాళహస్తి రూరల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తి డివిజన్ ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిదుర్గ కోరారు. శ్రీకాళహస్తిలోని సరస్వతి మున్సిపల్ హైస్కూల్‌లో కిశోర బాలికలకు సోమవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే ఇరు కుటుంబాలకు రెండు లక్షల రూపాయిలు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. జైలుశిక్ష కూడా విధిస్తారన్నారు. ఎవరికైనా బాల్య వివాహాలు చేస్తుంటే చైల్డ్ లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఆడపిల్ల చదువుకుంటే పేదరికాన్ని నిర్మూలించవచ్చన్నారు. నిరుపేద విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులు తెచ్చిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెరటి కోళ్లతో ఆదాయం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): పెరటి కోళ్ల పెంపకం సులువైన ఆదాయానికి మార్గమని ఎంపీడీఓ తరుణాక్షి రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీఓ స్వయం సహాయక సంఘాలకు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెరటి కోళ్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. మండలానికి ప్రభుత్వం 82 యూనిట్ల పెరటికోళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో



స్వయం సహాయక సంఘాలకు పెరటికోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి

ఏపీఎం గురుమూర్తి మాట్లాడారు. కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు, మండల మహిళా సమాఖ్య లీడర్లు సునీత, మునెమ్మ, అకౌంటెంట్ సరిత, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మా పేరుతో రుణాలు తీసుకుని పరారైంది!



నిరసన వ్యక్తం చేస్తున్న పొదుపు మహిళలు

గూడూరు: వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) తమ వద్ద సంతకాలు తీసుకుని, తమకు తెలియకుండానే భారీ మొత్తం బ్యాంకులో రుణం తీసుకుని ఆ సొమ్ముతో పరారైందని పొదుపు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రుణ బకాయిలు చెల్లించాలని తమపై బ్యాంకు అధికారుల ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని, తమకు న్యాయం చేయాలంటూ చెన్నూరులోని పొదుపు మహిళలు ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. ఈ మేరకు ఏఓకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చెన్నూరు గ్రామానికి చెందిన ఆరో సంఘంలో తాము సభ్యులమన్నారు. తమ వీఓఏ అయిన చల్లా శ్రీలక్ష్మి మీకు రుణం ఇప్పిస్తాను సంతకాలు చేయండని చెప్పిందన్నారు. ఐదు గ్రూపులకు చెందిన వారు సంతకాలు చేయగా, బ్యాంకులో వీఓఏ రూ.40 లక్షలు రుణం తీసుకుందన్నారు. తమకు కేవలం రూ.7.20 లక్షలు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఈ విషయం తెలుసుకుని, శ్రీలక్ష్మిని నిలదీయడంతో పరారైందన్నారు. ఈ విషయమై ఏపీఎంకు వినతి పత్రం అందజేసినా ఆమె కూడా పట్టించుకోలేదన్నారు. దీంతో రుణం చెల్లించాలంటూ బ్యాంకు అధికారుల నుంచి వస్తున్న ఒతిళ్లు తట్టుకోలేక, శ్రీలక్ష్మి భర్త మురళిని తీసుకొచ్చి రూరల్ పోలీసులకు అప్పగించామన్నారు. వారు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకుండా అతన్ని వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

సత్తా చాటిన సత్యవేడు కరాటే విద్యార్థులు



కరాటే పోటీలో క్రీడాకారులు



కరాటే పోటీలో బహుమతులు అందుకున్న విజేతలు

సత్యవేడు: ఒంగోలులో ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో సత్యవేడు విద్యార్థులు ప్రతిభ చాటి, కటా(విన్యాసాలు), కుమితే(ఫైటింగ్) విభాగాల్లో 8 బంగారు, 7 రజత, 4 కాంస్య పతకాలు సాధించారని కరాటే మాస్టర్ ఎంఏ. భాస్కర్ తెలిపారు. అండర్–10, 12, 14, 15, 16, 18 విభాగాల్లో వీరు సత్తా చాటారు. ఎస్ శ్యాం(16), కే. ధనుష్(18), ఎన్ సునిల్ (12) కటా, కుమితే విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. అలాగే జీ. ధనుష్(15) కటాలో బంగారు పతకం, దితేష్‌కుమార్(10) కుమితే లో సిల్వర్, టి. బాలాజీ కుమితేలో సిల్వర్, టి.కార్తికేయన్(12) కటాలో స్విలర్ సాధించాడు. జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొడాలి. రవిబాబు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యవేడు కరాటే మాస్టర్లు ఎం. మదన్, బి.హరి, పి.సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలభైరవ క్షేత్రంలో అష్టమి పూజలు



నేతి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పిచ్చాటూరు: మండలంలో రామగిరిలోని శ్రీ సంతాన కాలభైరవ స్వామి ఆలయంలో సోమవారం అష్టమి పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సోమవారం నాడే అష్టమి పర్వదినం రావడంతో భక్తులు పోటెత్తారు. కాళభైరవస్వామి, వాలీశ్వరస్వామి, మరగదాంబిగ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, విశేష అలంకారం చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ రాజ్ గురుక్కళ్ మూలవిరాట్ శ్రీ కాలభైరవస్వామికి శాస్త్రోక్తంగా అష్టమి అభిషేక పూజలు చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ సురేష్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.



రామగిరిలో అష్టమి పూజల్లో భక్త జనం

అష్టమి పూజల్లో కేంద్ర మంత్రి

పిచ్చాటూరు: రామగిరిలో సోమవారం సాయంత్రం నిర్వహించిన అష్టమి పూజల్లో కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి ఎల్ మురుగన్ పాల్గొన్నారు. పూజల అనంతరం ఆయనకు ఆలయ చైర్మన్ సురేష్, ఈఓ లత ఆలయ మర్యాదలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ రాజ్ గురుక్కళ్ తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

రేణిగుంట: గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ పద్మావతి పురం గ్రామ ప్రజలు మురుగు కాల్వలు, రోడ్డు సమస్యలను సోమవారం ప్రజాప్రతినిధులకు నివేదించారు. దీనిపై ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, అధికారులు స్పందించారు. పార్టీ మండల కన్వీనర్ బియ్యపు పవిత్రారెడ్డితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో గ్రామానికి మెయిన్ రోడ్ వేయించినట్లు చెప్పారు. ఇంటర్నల్ రోడ్, మెయిన్ డ్రైయిన్ సమస్య ఉందని, దీనిని



వెంకటాపురం, పద్మావతిపురం గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యోగేశ్వర రెడ్డి, జువ్వల దయాకర్ రెడ్డి, జమాలుద్దీన్, అక్బర్, షేక్ బాషా, మస్తాన్, సోము పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి చేయాలని ఏఎస్ఐ ఉష అన్నారు. సోమవారం మండలంలోని పల్లం ఉన్నత పాఠశాలలో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్ఐ మాట్లాడారు.బాలికలు విద్యతో జీవితానికి బాటలు వేసుకుంటే బాల్య వివాహాలకు ఆస్కారం ఉండదన్నారు. పేదరికం, నిరక్షరాస్యత.. బాల్య వివాహాలకు కారణమవుతున్నాయని, గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తున్న పక్షంలో 1098, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, ప్రజా ప్రగతి ట్రస్ట్ మండల కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్,



ర్యాలీలో ఏఎస్ఐ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ప్రగతి సంస్థ ఏర్పేడు, శ్రీకాళహస్తి మండల కన్వీనర్లు శిరీష, రామచంద్రయ్య, పాపానాయుడుపేట క్లస్టర్ కన్వీనర్ సుబోస్ చంద్రయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామధేనుపై వాల్మీకేశ్వరుని చిద్విలాసం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలోని సర్వమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వస్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు కామధేను వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో కొలువు దీరిన స్వయంభు వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిగ తాయారు, పళ్లికొండేశ్వర స్వామి, రామలింగేశ్వరస్వామి, దాంపత్య దక్షిణా మూర్తిలకు ప్రత్యేక అభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా యాగశాల పూజలు చేశారు. సాయంత్రం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, గజ పుష్పమాలలు, విశేషాభరణాలతో అలంకరించారు. కామధేను వాహనంపై పరమేశ్వరుడు, పల్లకిలో పార్వతీదేవి అధిష్టించి కోలాట బృందాల



సురుటుపల్లెలో వాహన సేవకు ముస్తాబైన పార్వతీ పరమేశ్వరులు

నృత్యాలు, మంగళవాయిద్యాల హోరు నడుమ ఊరేగారు. భక్తుల కర్పూర నీరాజనాలు సమర్పించారు. చెన్నైకి చెందిన నరసింహులు, రేవతి ఉభయదారులుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు, ఈఓ రామచంద్రా రెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ముక్కంటికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశునికి సోమవారం తమిళనాడు వాసి ఎస్.నాగరాజు 16 పట్టు చీరలు, 20 పట్టు పంచెలు సమర్పించారు. అలాగే నాయుడుపేట వాసి, సాగర్ సిమెంట్ అధినేత కె.సుబ్రమణ్యం, సురేష్, రమేష్ 300 టీషర్టులను శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబుకు అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద చైర్మన్ శేషవస్త్రాలతో సత్కరించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికి, స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో ఈఈ మురళీధర్ రెడ్డి,



చైర్మన్, ఈఓకు పట్టుచీరలు, పంచెలు అందజేస్తున్న తమిళనాడు వాసులు

బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే మూర్ఛ నివారణ

ఏర్పేడు: మూర్ఛ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే 40 శాతం వరకు నివారించవచ్చని తిరుపతి స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ వెంగమ్మ అన్నారు. అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని సోమవారం మండలంలోని పాపానాయుడుపేట జెడ్పీ హైస్కూలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం మూలాన ఎప్పటికప్పుడు వైద్య రంగం చోటుచేసుకుంటున్న మార్పులు వివిధ రుగ్మతలకు మెరుగైన వైద్యం అందివ్వడానికి దోహదం చేస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు, మానసిక రుగ్మతలు మూర్ఛ వ్యాధికి ప్రధాన కారణాలని చెప్పారు. కచ్చితమైన నిర్ధారణ పరీక్షలు చేసి, మందులు



సమావేశంలో స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ

వాడాలని సూచించారు. మూర్ఛ వ్యాధి లక్షణాలు, అపోహలు, చికిత్సా విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వ స్వామి ఆలయంలో సోమవారం కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆధ్వర్యంలో కాలభైరవ స్వామికి హోమ పూజలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, ఉదయ కర్తలు, సుబ్రహ్మణ్యేశ్వర పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.